## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి అయుబొద్దీన్**



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి అయుబొద్దీన్

మహదేవపూర్, జూన్ 22 : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ అయుబొద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉచిత బస్‌పాస్ సౌకర్యం, 250గజాల్లో ఇందిరమ్మ ఇల్లు, ఆరోగ్యశ్రీ కార్డు, రూ.25వేల పెన్షన్, ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని, సంక్షేమ పథకాల్లో 20శాతం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, సీనియర్ తెలంగాణ ఉద్యమకారులు ఆన్కారి ప్రభాకర్, ఎనమండ్ర వామన్ రావు, అక్రమొద్దీన్, జాడి గట్టయ్య, పోత రమేశ్, ఇర్షాద్ పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారెడ్డి

గోవిందరావుపేట, జూన్ 22 : ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల మహిళా విభాగం రాష్ట్ర కోకన్వీనర్ సంధ్యారెడ్డి అన్నారు. పస్రాలో ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉద్యమకారుల పోరాటంతోనే రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చకపోగా పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోందని అన్నారు. ఉద్యమకారులు రమేశ్, సుగుణ, పూలమ్మ, సుహాసిని, సుజాత, మల్లమ్మ, గీత, సుజాత, సరోజన, సరిత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యాచరణ

- ములుగు జిల్లాలో తేలిన ఓటర్ల లెక్క
- ఏర్పాట్లల్లో అధికారులు
- 171 జీపీలలో 2,31,052ఓటర్లు
- 10 మండలాలలో 83ఎంపీటీసీలు
- 10 జడ్పీటీసీలు, 10ఎంపీపీలు
- ఓటింగ్ కోసం 473 పోలింగ్ కేంద్రాలు



ములుగు జిల్లా పరిషత్ కార్యాలయం

ములుగు, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీ రిజర్వేషన్లపై ఏర్పడిన సందిగ్ధత కారణంగా 15నెలలుగా ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల పదవులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ వరుస ప్రకటనలు చేస్తున్నది. ఈ క్రమంలో ములుగు జిల్లాలో స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో వెలువడే అవకాశాలు ఉండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. జిల్లాలో మొత్తం 174 గ్రామ పంచాయతీలు ఉండగా, 3 గ్రామపంచాయతీలు ములుగు మున్సిపాలిటీలో విలీనహయ్యాయి. మిగతా 171 జీపీల్లో 2,31,052 ఓటర్లు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి గ్రామాలు, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు, తర్వాత సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా జిల్లాలో 10 మండలాల్లో జడ్పీటీసీలు, ఎంపీపీలతోపాటు 83 ఎంపీటీసీ స్థానాలకు ముందుగా ఎన్నికలు జరిపేందుకు అధికారులు ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. ఓటింగ్ నిర్వహణకు 473 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సమాయత్తం అవుతున్నారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కావడంతో ఎన్నికల కమిషన్ జారీ చేసే నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ కంటే ముందు వరకు నమోదైన ఓటర్లను కూడా పరిగణలోకి తీసుకుంటే సంఖ్య పెరిగి మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ విధించనున్న గడువు వరకు జాబితాలో పూర్తి స్పష్టత కనిపించనున్నది. జిల్లాలో గతంలో 87ఎంపీటీసీలు ఉండగా ములుగు మున్సిపాలిటీ పరిధిలోకి నాలుగు ఎంపీటీసీలు విలీనం కాగా, 83 ఎంపీటీసీలకు మాత్రమే ప్రస్తుతం ఎన్నికలు జరగనున్నాయి. గతంలో తొమ్మిది జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఉండగా నూతనంగా ఏర్పడిన మల్లంపల్లి మండలంతో వీటి సంఖ్య 10కి చేరింది. ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీ రిజర్వేషన్లు కూడా త్వరలో పూర్తి స్థాయిలో తేలనున్నాయి.

***171 జీపీల్లో 2,31,052 ఓటర్లు***

జిల్లాలో 171 జీపీల్లో ఎన్నికలు జరగనుండగా 2,31,052 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ములుగు మండలంలో 19 జీపీల్లో 9 ఎంపీటీసీలకు 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 24,947 మంది ఓటర్లు ఉన్నారు. మల్లంపల్లి మండలంలోని 10 జీపీల్లో 5 ఎంపీటీసీలకు 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 13,462 మంది ఓటర్లు ఉన్నారు. వెంకటాపూర్ మండలంలోని 23 జీపీల్లో 9 ఎంపీటీసీలకు 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 28,350 మంది ఓటర్లు, గోవిందరావుపేట మండలంలోని 18 జీపీల్లో 9 ఎంపీటీసీలకు 64 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 25,490 మంది ఓటర్లు, తాడ్వాయి మండలంలోని 18 జీపీల్లో 7 ఎంపీటీసీలకు 38 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 18,389 మంది ఓటర్లు, ఏటూరునాగారం మండలంలో 12 జీపీల్లో 9 ఎంపీటీసీలకు 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 24,590 మంది ఓటర్లు, కన్నాయిగూడెం మండలంలో 11 జీపీల్లో 5 ఎంపీటీసీలకు 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 9,943 మంది ఓటర్లు, మంగపేట మండలంలో 25 జీపీల్లో 14 ఎంపీటీసీలకు 77 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 39,689 మంది ఓటర్లు, వెంకటాపురం(నూగూరు) మండలంలో 18 జీపీల్లో 9 ఎంపీటీసీలకు 58 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 26,781 మంది ఓటర్లు, వాజేడు మండలంలో 17 జీపీల్లో 7 ఎంపీటీసీలకు 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 19,411మంది ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో మంగపేట మండలంలో హైకోర్టు ఆదేశాల కారణంగా ఎన్నికలు జరగలేదు. ప్రస్తుతం మంగపేట మండలంలో ఎన్నికలు జరుగుతాయా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.

## జేఈఈ, నీట్, ఎంసెట్‌లో ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు

ఏటూరునాగారం, జూన్ 22 : పూర్వ వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమశాఖ నిర్వహిస్తున్న గిరిజన ఆశ్రమ కళాశాలలు, గురుకుల కళాశాలలు, ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు జేఈఈ, నీట్, ఎంసెట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక చేసి రెసిడెన్షియల్ పద్ధతిలో కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. లాంగ్ టర్మ్ శిక్షణలో నీట్–2025లో 200పై మార్కులు సాధించిన గిరిజన విద్యార్థుల్లో పది మందిని మెరిట్ ఆధారంగా శిక్షణ కోసం ఎంపిక చేసి నీట్–2026కు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్‌తోపాటు రెండేళ్ల జేఈఈ, నీట్ కోచింగ్ కోసం ఈనెల 28వ తేదీలోగా హనుమకొండ బాలసముద్రం గిరిజన సంక్షేమ శాఖ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. వివరాలకు 76759 78439, 83285 46015 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## బీసీ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్

ఏటూరునాగారం, జూన్ 22 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ ప్రవేశం కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బురాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలను ఈ విద్యా సంవత్సరం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బీఎస్సీ, బీకాం, బీఏ గ్రూపుల్లో ఎంపీసీఎస్, ఎంపీసీ, బీజడ్‌సీ, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అన్ని ధ్రువపత్రాలతో ఈనెల 24వ తేదీలోగా స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉచిత వసతులు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందిస్తామన్నారు. కళాశాలలో అధునాతన ల్యాబొరేటరీ, కంప్యూటర్ ల్యాబ్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పీజీ కోచింగ్‌ను అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9059490623, 93925440836లను సంప్రదించాలని కోరారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కృష్ణకాలనీ, జూన్ 22 : యువత డ్రగ్స్ వంటి ప్రమాదకర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్ అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించారు. చదువు, ఉద్యోగం, కుటుంబం వంటి జీవిత పునాదులను మత్తు పదార్థాలు నాశనం చేస్తాయన్నారు. అందుకే 'డ్రగ్స్‌కు నో' చెప్పడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలన్నారు.

## 'ఇందిరమ్మ ఇండ్ల పేరుతో వసూళ్ల దందా'

వెంకటాపూర్, జూన్ 22 : ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మంత్రి సీతక్క ఇలాకాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్యా జవహర్‌లాల్ ఆరోపించారు. ఆదివారం నల్లగుంట జీపీ పరిధిలోని గంపోనిగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇండ్ల మంజూరులో అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. నిరుపేదలకు అండగా ఉండి దళారుల వసూళ్ల దందాను అరికడతామన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చే వరకు పోరాడుతామన్నారు. నాయకులు కృష్ణ, శ్రీధర్, రూప్ సింగ్, శరత్, అన్వేష్, రాజు, కిరణ్, రాజయ్య, సతీశ్ ఉన్నారు.

## 25 నుంచి జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు

కృష్ణ కాలనీ, జూన్ 22 : తెలంగాణ రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 25వ తేదీ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడలలో పాల్గొనాలని తెలిపారు. విద్యార్థులు తమ వెంట పుట్టిన తేదీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, స్కూల్ కండక్ట్ సర్టిఫికెట్, పాస్ ఫోటోస్(5), ఆధార్‌కార్డ్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9618011096, 8125113132లను సంప్రదించాలని డీవైఎస్‌వో రఘు సూచించారు.

## భూపాలపల్లిలో 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం

భూపాలపల్లి రూరల్, జూన్ 22 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం ఉదయం 8 గంటల వరకు 3.4మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా పరిధిలోని మహదేవపూర్ మండలంలో 1.4మి.మీ, పలిమెలలో 2.2, మహాముత్తారంలో 3.4, కాటారంలో 1.8, మల్హర్‌లో 7.2, చిట్యాలలో 2.4, టేకుమట్లలో 3.2, మొగుళ్లపల్లిలో 5, రేగొండలో 6.8, గణపురంలో 2.2, భూపాలపల్లి మండలంలో 2.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వారు తెలిపారు.

## ఒకే గదిలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం

**పాయబట్ల గ్రామంలో నిర్వహణ.. శిథిలావస్థలో పాఠశాల భవనం**



ఒకే గదిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు, అంగన్‌వాడీ టీచర్

వాజేడు, జూన్ 22 : మండలంలోని దూలపురం జీపీ పరిధి పాయబట్ల గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఒకే గదిలో కొనసాగుతున్నాయి. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేకపోవడంతో మూడేళ్లుగా మూతబడింది. ఈ క్రమంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఏడుగురు విద్యార్థులు ఉండటంతో ప్రారంభించారు. కానీ విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు లక్ష్మీపురం పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడు కే సతీష్‌కుమార్‌ను నియమించగా విద్యాబోధన చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గురు, పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు ఒకే గదిలో విద్యాబోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఓ వైపు అంగన్‌వాడీ, మరో వైపు పాఠశాల ఒకే గదిలో నిర్వహించడం ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ తప్పనిపరిస్థితుల్లో కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్‌రావును వివరణ కోరగా మండలంలో ఏడు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరగా నూతన భవనాలు మంజూరు చేయాలని ఎంపీడీవో శ్రీకాంత్‌నాయుడుకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

## గాజర్ల రవి కుటుంబానికి రాజయ్య పరామర్శ



గాజర్ల రవి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సిరిసిల్ల రాజయ్య

టేకుమట్ల, జూన్ 22: ఇటీవల (ఈనెల 18న) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన గాజర్ల రవి అలియాస్ గణేశ్, ఉదయ్ కుటుంబ సభ్యులను వరంగల్ మాజీ ఎంపీ, ప్రణాళిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఆదివారం అతడి స్వగ్రామమైన వెలిశాలకు వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవి తమ్ముడు అశోక్, అన్న సారయ్య(ఆజాద్), కుమారుడు నవీన్ ఎన్‌కౌంటర్ తీరును అడిగి తెలుసుకుని ఓదార్చారు. రవి యువకుడిగా ఉద్యమబాట పట్టి తన సొంత కుటుంబాన్ని ఊరు వదిలి ప్రజా సేవే లక్ష్యంగా ఎన్నో కష్టాలు అనుభవించి చివరికి ప్రాణాలను కోల్పోయాడని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్, జిల్లా నాయకుడు కత్తి సంపత్ గౌడ్, వీరవేణి శ్రీనివాస్, బండి రవీందర్, వంగ నరేష్, సంగీ రవి, కోరే చంద్రమౌళి, జంగాపల్లి సారయ్య, తిరుపతి పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కోసం పోరాడాలి

ములుగు రూరల్, జూన్ 22 : లంబాడీలు సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలని లంబాడ న్యాయవేదిక జిల్లా అధ్యక్షుడు పోరిక శ్యామల్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పాల్తియ శ్యామ్‌నాయక్ అధ్యక్షతన ములుగులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీ కులాలలో ఎక్కువ కులాలకు మంత్రి మండలిలో స్థానం లేదని అన్నారు. కుమ్మరి, చాకలి, యాదవ, మున్నూరుకాపు, విశ్వబ్రాహ్మణ మేర, మేదర, లంబాడా వడ్డెర సామాజిక వర్గాలకు మంత్రి పదవులు నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవులు లేవని తెలిపారు. కేవలం రెడ్డి, ఎస్సీ, బ్రాహ్మణ వర్గాలకు స్థానం లభించడం విచారకరమని, మిగతా సామాజిక వర్గాలకు ప్రాధాన్యత కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రతి కులానికి సామాజిక న్యాయం దక్కేందుకు కృషి చేస్తామని అన్నారు.




నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

BUSINESS OFFER

★Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing/Fixed Returns, Safe & Secure. 6301859174.
NT-325295

CHANGE OF NAME

★I, RAJITHA MUPPIDI (Old Name) R/o H.No. 25-7-55, Vishnupuri, Kazipet, Hanumakonda Dist. TG. I have changed my name from RAJITHA MUPPIDI to MEKALA LAVANYA (New Name) W/o MEKALA SHYAM KUMAR for all future purposes.
NTW-6717

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

## నేడు ఉపాధి హామీ పథకంపై 'ప్రజావేదిక'

మహదేవపూర్, జూన్ 22 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో 15వ విడత సామాజిక తనిఖీ నివేదికపై సోమవారం ఉదయం 10గంటలకు మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 2024, ఏప్రిల్ 1 నుంచి 2025 , మార్చి 31 వరకు చేపట్టిన పనులకు సంబంధించి ఈనెల 14–22 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ పూర్తయిందని ఎంపీడీవో తెలిపారు. ప్రజావేదిక కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

## 'శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తప్పవు'

భూపాలపల్లి రూరల్, జూన్ 22 : భూపాలపల్లి మండలంలో ప్రభుత్వ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి పట్టణ సీఐ నరేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమానితులను విచారిస్తున్నామని, శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. వారి గత నేరచరిత్ర ఆధారంగా అవసరమైతే రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని సీఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ ఒకరు మృతి

గోవిందరావుపేట, జూన్ 22 : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన దొబ్బరి అంజయ్య(51) చికిత్సపొందుతూ మృతి చెందాడు. శనివారం రాత్రి పస్రా–మొద్దులగూడెం రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా చికిత్స నిమిత్తం ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు పస్రా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'రాజీవ్ యువ వికాసం' అమలు చేయాలి

గోవిందరావుపేట, జూన్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దరఖాస్తులు తీసుకోవడం తప్పా అమలుకు నోచుకోవడం లేదని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ కోరారు. పస్రాలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం ప్రవేశపెట్టిన పథకాన్ని అమలు చేస్తామని, దరఖాస్తులు తీసుకొని నిలిపివేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. తక్షణం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంజీవ్, ప్రవీణ్, రవీందర్, నరేశ్, కృష్ణబాబు, ప్రదీప్, శ్రావన్, లాసర్, భాస్కర్, రాఘవేంద్ర, ఫారుక్, సద్దాం, భరత్, చిరంజీవి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## వెలవెలబోతున్న లక్నవరం సరస్సు

గోవిందరావుపేట, జూన్ 22 : ప్రస్తుత వానకాలంలో సీజన్‌లో నార్లు పోసుకుంటూ దుక్కులు దున్నుకుంటూ బిజీగా ఉండాల్సిన రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ఓ వైపు ఎండలు, మరో వైపు మబ్బులుగా ఉంటూ వర్షం కురుస్తుందని ఆశతో ఉన్నప్పటికీ వర్షం కురవకపోవడంతో వ్యవసాయ పనులు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో గుండెకాయ వంటి లక్నవరం సరస్సు సైతం నీరు లేక వెలవెలబోతున్నది.



నీరు లేక వెలవెలబోతున్న లక్నవరం

## నిర్వహణకు నోచుకోని టాయిలెట్స్



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి, మూత్రశాల

ఏటూరునాగారం, జూన్ 22 : స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఆవరణలోని టాయిలెట్స్ నిర్వహణకు నోచుకోవడం లేదు. దీంతో ఐటీడీఏకు వచ్చే గిరిజనులతోపాటు ఇతరులు ఇబ్బంది పడుతున్నారు. ఐటీడీఏ ఆవరణలో ఉన్న టాయిలెట్ బ్లాక్‌లో మరుగుదొడ్డి, మూత్రశాల నిర్వహణ సక్రమంగా లేక దుర్వాసన వస్తోంది. ఇటీవల ఈ బ్లాక్‌కు సున్నాలు వేసి తీర్చిదిద్దారు. కానీ నిర్వహణకు నోచుకోవడం లేదు. లోపలలి వైపు అంతా అస్తవ్యస్తంగా కనిపిస్తున్నది. మూత్రశాలల్లో బేసిన్లు బిగించకపోవడం, ట్యాప్‌లు అవసరమైన చోట బిగించకపోవడం, మరుగుదొడ్లలో నీటి కోసం బకెట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో అపరిశుభ్రంగా ఉండడం, చిన్నచిన్న సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

## కిక్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

కృష్ణ కాలనీ, జూన్ 22 : జయశంకర్ జిల్లా కేంద్రంలోని అపోలో ఫార్మసీ 2వ అంతస్తులో కిక్ బాక్సింగ్ అకాడమీ హాల్‌లో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడాపోటీలకు భూపాలపల్లి మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. కాండిటెడ్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు నిర్వహించగా ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిలో పాయింట్ ఫైటింగ్, లైట్ కాంటక్ట్ విభాగాలలో ఎం విద్విన్, బీ నిహన్, బీ లవన్, ఈ నితిన్, ఈ కృతిక్, కే కౌశిక్, పీ తనీష్, రాజన్‌బాబు, హిమనిష్, బీ మాగన్య, టీ హరిణి, పీ అవిక, ఎస్ నివేదన, బీ ఆరాధ్య, బీ ధృతిపర్ణిక, ఎం విధిషదేవి, సద్రుష్య సాయి, ఎన్ అధ్య, ఎస్ సంజన శ్రీ, కే హరని ఎంపికయ్యారు. వీరు మహబూబ్‌నగర్‌లో జరిగే తెలంగాణ రాష్టస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారని కరాటే మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, మాస్టర్స్ జీ అశోక్, కే దిలీప్, జే శ్రీధర్, ఆర్ రిషి పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

కృష్ణ కాలనీ, జూన్ 22 : జూలై 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త అఖిలభారత సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి ఏరియాలోని బాతాళ రాజన్న భవన్‌లో సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ నీరేటి రాజన్న పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాల రక్షణ, కనీస వేతనాలు రూ.30వేలు పెంపు, ఉద్యోగ భద్రత, ఉపాధి హక్కుల సాధన కోసం ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీఎస్‌యూఎస్ కార్మిక సంఘం నాయకులు దాసరి జనార్దన్, సమ్మె రాజయ్య, వెంగళ కనకయ్య, గొడిసెల శ్రీహరి, కాసర్ల ప్రసాద్ రెడ్డి, ఎంఎఫ్ బేగ్, పీ చంద్రశేఖర్, నామాల శ్రీనివాస్, బీరన్న, రాళ్లబండి బాబు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రాజారత్నం

## హామీలు అమలు చేయాలి

కృష్ణకాలనీ, జూన్ 22 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారత్నం డిమాండ్ చేశారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకురాలు పొనగంటి లావణ్య ఆధ్వర్యంలో డీహెచ్‌పీఎస్ మూడో జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు రాజారత్నం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంబేద్కర్ యోజన పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. ఇందిరమ్మ ఇంటి పథకంలో దళిత కుటుంబాలకు రూ.6లక్షలు కేటాయించాలన్నారు. డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి భద్రయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్‌కుమార్, నేరెళ్ల జోసెఫ్, పసరగొండ మహేందర్, బౌతు కమలాకర్, దొంతుల రవీందర్, రాజమౌళి, గుర్రం సంపత్, రమేశ్, రాజేశ్, చిట్యాల పద్మ, బానమ్మ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తాడ్వాయి, జూన్ 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. 1995–96 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఒక్కచోట చేరి నాటి మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. గురువులకు పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు. సుమారు వంద మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన మోటార్ ఏర్పాటు




మోటార్ ఆన్ చేసిన జనార్దన్, గ్రామస్తులు

కాటారం, జూన్ 22 : కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని అంగడిబజార్‌లో బోర్ మోటార్ చెడిపోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతుండగా మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్ ఆదివారం కొత్త మోటార్ ఏర్పాటు చేయించారు. సొంత ఖర్చులతో మోటార్ కొని బిగించి ఆన్ చేశారు. కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. పలువురు కాలనీవాసులు ఉన్నారు.

## రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ

భూపాలపల్లి రూరల్, జూన్ 22 : జిల్లాల్లోని రైతులకు ఆదివారం వరకు రైతు భరోసా కింద రూ.132,52,49,227లు నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వీరూనాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 1,14,011 మంది రైతుల ఖాతాల్లో మొత్తం రూ.1,32,52,49,227లు నేరుగా జమ చేసినట్లు తెలిపారు.

## గొత్తికోయలకు బట్టల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్సై దంపతులు

వెంకటాపూర్, జూన్ 22 : ఎస్సై చల్లా రాజు ఆదివారం తన బర్త్‌డే సందర్భంగా నందిపహాడ్ గొత్తికోయగూడెంలోని గొత్తికోయ కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ మేరకు చిన్నారుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి వారికి పంపిణీ చేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## రెండు మోటర్లతో దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, జూన్ 22 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని రెండు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతోంది. ఆదివారం ఫేస్–2లో ఉన్న రెండు మోటర్ల ద్వారా 494క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎత్తిపోతల వద్ద నీటిమట్టం 72.75 మీటర్లకు తగ్గిపోవడంతో ఎప్పుడైనా మోటర్లను బంద్ చేసే అవకాశం ఉంది. కాగా, దిగువన ఉన్న తుపాకుల గూడెం సమ్మక్క బరాజ్ వద్ద రెండు గేట్లను పైకెత్తి ఎగువనుంచి వస్తున్న 6వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

## ట్రాలీ ఆటో యూనియన్ మండల కార్యవర్గం ఎన్నిక

కాటారం, జూన్ 22 : ట్రాలీ ఆటో యూనియన్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా జిల్లెల్ల శంకర్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా జడల బాపు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రాలీ ఆటో యూనియన్ సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, నిబంధనల మేరకు నడుచుకోవాలని అధ్యక్షుడు శంకర్ కోరారు.